# గణేష్ నవరాత్రుల్లో ఆధ్యాత్మికత ఎక్కడ?

- భక్తి పేరుతో హంగామా..
- వినాయకుడి సన్నిధిలోనే వినోదాల జోరు!
- ముందు తరాలకు మనం ఏం నేర్పిస్తున్నాం?




**కొత్తగూడెం బ్యూరో సెప్టెంబర్ 22(విజన్ ఆంధ్ర)** గణేష్ నవరాత్రులు అంటే భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయం, సంస్కృతికి ప్రతీక. వినాయకుడిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించడం వెనుక ప్రధాన ఉద్దేశం ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడమే. అయితే కొన్ని చోట్ల ఉత్సవాల పేరుతో జరుగుతున్న కార్యక్రమాల తీరు పండుగ అసలు ఉద్దేశాన్ని పక్కదారి పట్టిస్తోందా? అనే ప్రశ్నలను రేకెత్తిస్తోంది. విగ్రహ ప్రతిష్ఠకు ముందు భక్తిశ్రద్ధలతో ఏర్పాట్లు.. పూజలు.. నియమ నిష్ఠలు. కానీ ప్రతిష్ఠ పూర్తయిన తర్వాత కొన్ని చోట్ల వాతావరణం పూర్తిగా మారిపోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. దేవుడి సన్నిధిలోనే నృత్యాలు, వినోద కార్యక్రమాలు, అధిక శబ్దాలతో హంగామా చేయడం ఎంతవరకు సమంజసం? అన్నది ఆలోచించాల్సిన అంశం.

**అసలు భక్తి ఎక్కడ?**

ఉత్సవాల్లో ఆనందం ఉండకూడదని ఎవరూ చెప్పరు. అయితే ఆనందం పేరుతో ఆధ్యాత్మికతను పక్కన పెట్టకూడదు. పండుగ అంటే కేవలం హంగామా, వినోదం, ప్రదర్శన కాదు. భక్తి, సేవ, సోదరభావం, సామాజిక బాధ్యతలను పెంపొందించే వేదికగా ఉత్సవాలు నిలవాలి.

**పెద్దలే దారి చూపాలి**

పిల్లలు, యువత పెద్దలను చూసే నేర్చుకుంటారు. సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ఉన్న పెద్దలే మౌనం వహిస్తే.. యువతకు సరైన మార్గదర్శకత్వం ఎవరు ఇస్తారు? పండుగ పవిత్రతను కాపాడుతూ, భక్తి భావాన్ని పెంపొందించేలా కార్యక్రమాలను నిర్వహించాల్సిన అవసరం ఉంది.

**ముందు తరాలకు మనం ఏం నేర్పిస్తున్నాం?**

మన సంస్కృతి మన చేతుల్లోనే ఉంది. మన సంప్రదాయం మన బాధ్యతే. రేపటి తరాలకు పండుగల విలువను పరిచయం చేయాల్సిన బాధ్యత కూడా మనదే. పండుగను ఘనంగా జరుపుకోవడం అంటే శబ్దం పెంచడం కాదు.. భక్తిని పెంచడం. ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించడం అంటే హంగామా చేయడం కాదు.. ఆధ్యాత్మికతను చాటడం. మన పండుగలను మనమే కించపరచకుండా..మన సంస్కృతిని మనమే కాపాడుకుందాం.

భక్తితో గణనాథుడిని కొలుద్దాం.. భక్తితోనే ఉత్సవాలను ముగిద్దాం.

# కల్వకుర్తిలో భక్తి సందడి

- అష్ట ఋషి మహా మట్టి గణపతిని దర్శించుకున్న ప్రముఖులు
- కాశీ విశ్వనాథ్ యువసేన ఆధ్వర్యంలో పర్యావరణ సందేశం
- ప్రభుత్వ వైద్యులు, ఎంవీఐ దర్శనం - శాలువాలతో ఘన సత్కారం

**కల్వకుర్తి, సెప్టెంబర్ 21 (విజన్ ఆంధ్ర):** కల్వకుర్తి పట్టణంలో పర్యావరణ స్పృహతో ఏర్పాటు చేసిన అష్ట ఋషి మహా మట్టి గణపతి భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాడు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముందు కాశీ విశ్వనాథ్ యువసేన ఆధ్వర్యంలో ప్రతిష్టించిన ఈ విశిష్ట మట్టి గణపతిని దర్శించుకునేందుకు ప్రముఖులు, అధికారులు తరలివస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ శివరాం, డాక్టర్ యశోద, కల్వకుర్తి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మనోజ్ కుమార్ స్వామివారిని మంగళవారం దర్శించుకున్నారు. వేద మంత్రాల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పూలమాలలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. అష్ట ఋషులతో కూడిన ఈ మహా మట్టి గణపతి విశిష్టతను, మట్టి గణపతిని పెట్టడం వెనుక ఉన్న పర్యావరణ పరిరక్షణ ఆలోచనను తెలుసుకున్న అధికారులు కాశీ విశ్వనాథ్ యువసేన సభ్యులను మనస్ఫూర్తిగా అభినందించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కు బదులు మట్టి గణపతులను పూజించడం ద్వారానే ప్రకృతిని కాపాడుకోవచ్చని, యువతకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అనంతరం భక్త బృందం, ఉత్సవ కమిటీ సభ్యులు డాక్టర్ శివరాం, డాక్టర్ యశోద, ఎంవీఐ మనోజ్ కుమార్ గార్లను శాలువాలతో ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాశీ విశ్వనాథ్ యువసేన సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# రంగారెడ్డి జిల్లాలో ఆయిల్‌పామ్ తొలి పంట కోత మహోత్సవం

- ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయ అవకాశాలు
- ఎమ్మెల్యే శ్రీ వీర్లపల్లి శంకర్





**రంగారెడ్డి జిల్లా బ్యూరో సెప్టెంబర్ 22 (విజన్ ఆంధ్ర):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంపు కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లాలో తొలిసారిగా ఆయిల్‌పామ్ పంట కోత మహోత్సవాన్ని కేశంపేట మండలం అల్వాల గ్రామంలో నిర్వహించారు. ఈ ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ శాసనసభ్యులు శ్రీ వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 4,531 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలను సాగు చేసినట్లు వెల్లడించారు. 2025--26 సంవత్సరానికి జిల్లాలో 2,300 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటివరకు 829 మంది రైతులు 2,671 ఎకరాల సాగుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. నిర్దేశించిన లక్ష్యానికి మించి రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపడం సంతోషకరమైన విషయమన్నారు.

**తొలి పంట దిగుబడిని అందుకున్న రైతు**

కేశంపేట మండలం అల్వాల గ్రామానికి చెందిన రైతు శ్రీ భుజంగ రెడ్డి 2023 అక్టోబర్ 26న 6.5 ఎకరాల విస్తీర్ణంలో 371 ఆయిల్‌పామ్ మొక్కలను నాటినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు ద్వారా తొలి పంటను పొందడం రైతులకు మంచి ప్రోత్సాహాన్ని అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయ అవకాశాలు లభించే అవకాశం ఉందని, జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు ఉద్యాన శాఖ చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే తెలిపారు.

**రైతులతో ముఖాముఖి**

కోత మహోత్సవంలో భాగంగా రైతులతో ప్రశ్నోత్తర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయిల్‌పామ్ సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, మొక్కల సంరక్షణ, తెగుళ్ల నివారణ, దిగుబడి, మార్కెటింగ్ తదితర అంశాలపై రైతులు ప్రశ్నలు అడిగారు. బి.ఎన్. రావు, శాస్త్రవేత్త రైతుల సందేహాలకు సమాధానాలు అందిస్తూ, ఆయిల్‌పామ్ సాగులో పాటించాల్సిన శాస్త్రీయ పద్ధతులు, మొక్కల సంరక్షణ, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, తెగుళ్ల నివారణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కొత్తగా ఆయిల్‌పామ్ సాగు చేయాలనుకునే రైతులకు పంటకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకుని శాస్త్రీయ పద్ధతులను పాటించాలని సూచించారు. ఆయిల్‌పామ్ సాగు వల్ల కలిగే దీర్ఘకాలిక ప్రయోజనాలను వివరించడంతో పలువురు రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి వ్యక్తం చేశారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచడంతో పాటు రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, అవగాహన కల్పించేందుకు ఉద్యాన శాఖ నిరంతరం కృషి చేస్తోందని అధికారులు తెలిపారు. రైతులు ఆయిల్‌పామ్ సాగుకు సంబంధించిన సందేహాలను ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీమతి యాస్మిన్ భాషా, జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల అధికారి శ్రీ సురేష్, ఉద్యాన శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, వాల్యూ ఆయిల్ కంపెనీ ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.